بِسۡمِ اللّٰهِ الرَّحۡمٰنِ الرَّحِیۡمِ    نَحۡمَدُہٗ وَنُصَلِّیۡ عَلٰی رَسُوۡلِہِ الۡکَرِیۡمِ    وَعَلٰی عَبۡدِہِ الۡمَسِیۡحِ الۡمَوۡعُوۡدِ

**Summary of Friday Sermon Hadhrat Khalifatul Masih V 06.04.2018 (Telugu)**

## ప్రాపంచిక లాభములు పొందుటకు అల్లాహ్ తఆలా నుండి దూరమగు ఏదేని పనికి పాల్పడినామోనని ప్రతి అహ్మది ఆత్మ పరిశీలన చేసుకోవలెను, మన పునాది అసత్యముపై వున్నచో, ప్రాపంచికమును పొందుటను మన ఉద్దేశముగా భావించినచో మనము అల్లాహ్ తఆలా శుభములకు వారసులము కాలేము

*హజ్రత్ అమీరుల్ మోమినీన్ ఖలీఫతుల్ మసీహిల్ ఖామిస్ అయ్యదహుల్లాహు తాలా బినస్రిహిల్ అజీజ్ 06.04.2018 తేదీన - మస్జిద్ బైతుర్రహ్మాన్ స్పెయిన్‌లో ప్రసంగించిన ఖుత్బా జుమా సారాంశము*

తషహ్హుద్, తఅవ్వుజ్, సూర ఫాతిహా పఠనానంతరం హుజూరె అన్వర్ అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్ ఇట్లనిరి. స్పెయిన్ దేశము పశ్చిమ దేశములలోనిదైనను ఆర్థిక స్థిరత్వము పరంగా ఐరోపా దేశముల కంటే వెనుకబడి యున్నదని అంటారు. ఆదాయ వనరులు, ఆదాయము, జీవన ప్రమాణములు ఐరోపాలోని ఇతర దేశములు అనగా ఫ్రాన్స్, జర్మని, హోలేండ్ లేదా ఇంగ్లాండ్ కంటే తక్కువున్నవి. అయినను పాకిస్తాన్ కంటే దీని ఆర్థిక స్థితి మెరుగ్గానే వున్నది. అందుకే చాలా మంది పాకిస్తానీయులు వ్యాపారము లేదా ఉద్యోగము కొరకు ఇక్కడికి వస్తారు. అహ్మదీయులు పాకిస్తాన్ నుండి రెండు కారణముల వలన బయటికి వెళ్లుతారు. వీటిలో ముఖ్యమైన కారణము మతపరమైన ఆంక్షలు, స్వాతంత్ర్యయము లేక పోవడమే. రెండవది ఆర్థిక పరిస్థితులు ఇక్కడ మెరుగ్గా వుండడం. ఇక్కడికి వచ్చే వారిలో అధికులు అసైలమ్ తీసుకొనుటకు లేదా శాశ్వత పౌరసత్వము పొందుటకు మేము స్వతంత్రముగా తమను తాము ముస్లిములమని అనలేము, ప్రార్థనలు చేయలేము లేదా ధార్మిక ఆచారములు పాటించలేమని అంటారు. కొందరు తమ పరిస్థితులను వున్నది వున్నట్లుగానే తెలుపుతారు. కాని కొందరు అనవసరముగా ఇతర సాకులు కూడ చెప్పుతారు. యదార్థమైన, నిజమైన విషయము చెప్పి, మతము పేరున జరుగుచున్న అరాచకాలను వివరించి ఇటువంటి పిరిస్థితులలో మేమక్కడ వుండుట వలన మానసిక ఆందోళనకు గురవుతాము లేదా శాశ్వత పీడనము ఎదురగునని చెప్పినచో దాదాపు వీరు అర్థము చేసుకుంటారని నేను అనేక మార్లు చెప్పాను. ఇదే విధముగా మొదటి నుండి చివరి వరకు వాంగ్మూలము ఒకే విధముగా వుండవలెను. వాంగ్మూలము మార్చుడం వలన అధికారులకు అసత్యమనే అనుమానము కలుగును. ఒక అహ్మదీ అబద్ధము నుండి తప్పక దూరముండవలెను. అల్లాహ్ తఆలా అబద్ధము అన్యారాధనకు సమానమని సూచించెను. అన్యారాధనకు పాల్పడునని ఒక అహ్మదీతో ఎన్నడు ఆశించలేము. ఎందుకనగా అతడు ఒక వైపు నేను అందరికంటే ఎక్కువ దైవ ఏకత్వమును అంగీకరిస్తానని, ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం బానిసత్వములో వచ్చువాడనని, ఈ కాలపు ఇమామ్, మసీహ్ మౌవూద్, మహ్దీ మాహూద్‌ను విశ్వసిస్తానని ప్రకటించును. రెండవ వైపు ఒక దైవారాధకుడు దూరముండవలసిన ప్రాథమిక పాపము నుండి దూరముండకపోవడమేమిటి? ప్రాపంచిక లాభములు పొందుటకు అల్లాహ్ తఆలా నుండి దూరమగు ఏదేని పనికి పాల్పడినామోనని ప్రతి అహ్మది ఆత్మ పరిశీలన చేసుకోవలెను. మనము మన విశ్వాసమును రక్షించుకొనుటకు, తమ ధర్మముపై నిలుచుటకు మన దేశమును వీడినప్పుడు అల్లాహ్ తఆలా ఆదేశములకు అత్యంత ప్రాధాన్యతనివ్వవలెను. నిజమైన ఇస్లాం అహ్మదియ్యత్‌ను స్వీకరించిన తరువాత మన ప్రాధాన్యతలు ఏమైనవి? ఏమి కావలెనో మనము గ్రహించవలెను. ఈ ప్రాధాన్యతలు అల్లాహ్ తఆలా ఆదేశములకు అనుగుణంగా లేనిచో మన ప్రస్థాన ఉద్దేశమును మనము పొందలేదు. దాని ప్రకారమున్నచో మనము మన ప్రస్థాన ఉద్దేశమును పొందినవారమగుదుము. అల్లహ్ తఆలా శుభములు కూడ మనకు తోడుండును. అసత్యముపై మన పునాది వున్నచో, ప్రాపంచికమును పొందుటను మన ఉద్దేశముగా భావించినచో మనము అల్లాహ్ తఆలా శుభములకు వారసులము కాలేము. అల్లాహ్ తఆలాను ఒంటరివాడని విశ్వసించువారు, అల్లాహ్ తఆలాను ఆరాధించువారు ఎన్నడు అన్యారాధనకు పాల్పడలేరు. తమ జీవిత ఉద్దేశ వాస్తవమును అర్థము చేసుకున్నవారి

జీవిత మొదటి ఉద్దేశము అల్లాహ్ తఆలా ప్రీతిని పొందుటగును. ప్రాపంచికమును పొందుట, ప్రాపంచిక ఐశ్వర్యములలో లీనమగుట మన ఉద్దేశము కాదని సదా మనము గుర్తుంచుకోవలెను. అల్లాహ్ తఆలాను తృప్తిపరచుటకు అతను సూచించిన జీవిత ఉద్దేశమును పొందుటకు మనము ప్రయత్నించినప్పుడు మాత్రమే మనము నిజమైన సఫలమును పొందగలము. ఈ ప్రపంచములోకి వచ్చు ఉద్దేశమును పూర్తి చేయగలము. ఈ ప్రపంచము, దీని వరములు మనకు ఎలాగూ లభించును. ఎందుకనగా తన వద్దకు వచ్చిన వారిని అల్లాహ్ తఆలా ఇహపరలోక వరముల నుండి దూరముంచడు. నాతో ఇహపరలోక శుభములను కోరుమని అల్లాహ్ తఆలా మనకు ఈ ప్రార్థన నేర్పించెను. అతడిట్లనెను. رَبَّنَآ اٰتِنَا فِی الدُّنۡیَا حَسَنَۃً وَّفِی الۡاٰخِرَۃِ حَسَنَۃً وَّقِنَا عَذَابَ النَّارِ

హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం దీని గురించి ఇట్లనిరి. మానవుడు తన ఆత్మ సంతృప్తి కొరకు రెండు విషయములను ఆశించును. ఒకటి ఇహలోక పరిమిత జీవితములో సంభవించే ఆపదలు, కష్టములు, ఇబ్బందుల నుండి సురక్షితముగా వుండుట, రెండవది దేవుని నుండి దూరము చేయు పాపములు, నేరములు, ఆధ్యాత్మిక రోగముల నుండి మోక్షము పొందుట. ఇహలోక శుభము అనగా శారీరక, ఆధ్యాత్మిక పరంగా ప్రతి ఆపద, కష్టము, అవమానము, అగౌరవము నుండి సురక్షితముగా వుండుట. వాస్తవానికి రబ్బనా అను పదములోనే పశ్చాత్తాపము గురించి చిన్న సంజ్ఞ గలదు. మానవుడు రబ్బనా అనగా ఓ మా ప్రభువు అన్నప్పుడు అల్లాహ్ తఆలా వైపు మొకరిల్లును. ఎందుకనగా రబ్బనా అన్నప్పుడు గతములో ఆశ్రయించిన ఇతర ప్రభువులతో విసిగి వేసారి ఈ ప్రభువు వైపు వచ్చినట్లగును. బాధ, దుఃఖము లేనిదే ఈ పదము వెలువడదు. వారిట్లనిరి. మానవుడు తనకు అనేక ఆధారాలను చేసుకొని వుండును. తమ సాకులు, మోసములపై ప్రభువు మాదిరిగా నమ్మకముండును. అతనికి తమ విద్య లేదా బలముపై గర్వమున్నచో అదే అతని ప్రభువగును. తమ అందము లేదా ధనము, ఆస్తి పాస్తులపై అహంకారమున్నచో అదే అతని ప్రభువగును. సారాంశమేమనగా ఇటువంటి వేలాది ఆధారములు అతని వెంట గలవు. వీటన్నిటిని వీడి, వీటితో విసిగి వేసారి ఏకైక, నిజమైన, స్వచ్ఛమైన ప్రభువు ముందట తల వంచనంత వరకు, రబ్బనా అను పదము దుఃఖము, బాధాతప్త పిలుపులతో అతని ఆస్థానములో మోకరిల్లనంత వరకు అతడు నిజమైన ప్రభువును అర్థము చేసుకోనట్లే అగును. దుఃఖము, బాధాతప్త పిలుపు వెలువడినప్పుడే నిజమైన రబ్బనా అను పదము వెలువడును. నేను రబ్బనా అన్నప్పుడు నా ఏకైక అల్లాహ్‌ను వేడుకొంటున్నాను అను వాస్తవమును తెలుసుకొన్నప్పుడే ఇది సాధ్యమగును. ఇలా జరిగినప్పుడే అతడు నిజమైన అల్లాహ్‌ను అర్థము చేసుకొనును. అతనితోనే యాచించును. ఇటువంటి బాధాతప్త ధ్వనితో హృదయపూర్వకంగా అతని వద్ద తమ పాపములను అంగీకరించి పశ్చాత్తాపపడ్డప్పుడు, అతన్ని సంబోధించి రబ్బనా అనగా నిజమైన, స్వచ్ఛమైన ప్రభువు నీవే కాని మేము పొరపాటుగా ఇతర చోట్ల తిరుగుచుంటిమి, ఇప్పుడు నేను ఆ అసత్య విగ్రహములను, బూటకపు ఆరాధ్యదైవములను వీడి, సహృదయముతో నీ పోషణను అంగీకరించుచున్నాను, నీ ఆస్థానములో మోకరిల్లుచున్నాని అనును.

స్వచ్ఛందంగా, వినయ విధేయతలతో అల్లాహ్ తఆలా వద్ద మోకరిల్లి అతన్ని ఆరాధించి, తమ జీవిత ఉద్దేశమును అర్థము చేసుకొను ఈ స్థితిని హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం మనలో చూడదలచిరి. ఈ విధముగా మనము మన పోషకున్ని ప్రార్థించు హక్కు చెల్లించినప్పుడు ఇహలోక శుభములు కూడ మనకు లభించును, పరలోక శుభములు కూడ మనకు లభించును. వాస్తవానికి పరలోక శుభముల కొరకే ఇహలోక శుభములను మానవుడు యాచించును. అనగా ఆరోగ్యమున్నచో అల్లాహ్ తఆలా ఆరాధన హక్కు చెల్లించవచ్చును. ఆరోగ్యమున్నచో మానవుడు సరియైన రీతిలో ప్రార్థన చేయవచ్చును. ధనమున్నచో అల్లాహ్ తఆలా ధర్మము కొరకు ధనము త్యాగము చేయవచ్చును, అతని దాసుల హక్కుల చెల్లించుటకు అనుగ్రహము లభించును.

కనుక ఈ ముఖ్యమైన సూత్రమును సదా గుర్తుంచుకోవలెను. ఆరాధన హక్కు చెల్లించు విషయ ప్రస్థావన వచ్చినందున చెప్పదలచినదేమనగా అల్లాహ్ తఆలా ఆదేశము మేరకు తమ జీవిత ఉద్దేశమును పూర్తి చేయువారైనప్పుడే ఇది సాధ్యమగును. అల్లాహ్ తఆలా ఇట్లనును. وَمَا خَلَقۡتُ الۡجِنَّ وَالۡاِنۡسَ اِلَّا لِیَعۡبُدُوۡنِ అనగా నేను జిన్నాతులను, మానవులను నా ఆరాధన కొరకు మాత్రమే పుట్టించితిని.

హుజూరె అన్వర్ అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్ ఇట్లనిరి. అల్లాహ్ తఆలా ఆదేశముల వైపు మనము చూచినప్పుడు అల్లాహ్ తఆలాను ఎన్నడు మరచిపోకూడదని ఒక ఆదేశము తరువాత మరో ఆదేశము మనకు గుర్తు చేయును. మీ ప్రాపంచిక ప్రయత్నములు కూడ మిమ్ములను అల్లాహ్ తఆలా స్మరణను విస్మరించునట్లు చేయకూడదు. ప్రాపంచిక కోరికలను తీర్చుకొనుట మీ ఉద్దేశము కాకూడదు. హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం దీని గురించి ఒక చోట ఇట్లనిరి. నన్ను గుర్తించాలని, నన్ను ఆరాధించాలని నేను మానవులను పుట్టించితినని అల్లాహ్ తఆలా అనును. కనుక మానవుని జీవిత అసలు ఉద్దేశము అల్లాహ్ తఆలా ఆరాధన, అల్లాహ్ తఆలా జ్ఞానము, అల్లాహ్ తఆలా కొరకు త్యాగమగుటయేనని ఈ సూక్తితో స్పష్టమగును. ఇంకా ఇట్లనిరి. మానవుడు తమ జీవిత ఉద్దేశమును తానే నిర్ణయించుకొను స్థోమత అతనికి లేదను విషయము ఒక బహిరంగ సత్యము. ఎందుకనగా మానవుడు తన ఇష్టముతో రాడు, తన ఇష్టముతో తిరిగి పోడు. వాస్తవానికి అతనొక సృష్టి. సృష్టికర్త అతనికి ఇతర ప్రాణుల కంటే గొప్ప, ఉన్నత శక్తులు ప్రసాదించెను. అనగా ఇతరముల కంటే అతన్ని ఉత్తమ ప్రాణిగా చేసెను. ఉత్తమ శక్తులను ప్రసాదించెను. అతడే మానవుని జీవితమునకు ఒక ఉద్దేశము నిర్ధారించెను. మానవుడు ఈ ఉద్యేమును అర్థము చేసుకున్నా చేసుకోకపోయినా నిస్సందేహముగా అల్లాహ్ తఆలా ఆరాధన, అల్లాహ్ తఆలా జ్ఞానము, అల్లాహ్ తఆలాలో లీనమగుటయే మానవ జీవిత అసలు ఉద్దేశము.

మానవుడు ఈ ఉద్దేశమును గుర్తుంచుకొన్నప్పుడు అతడు నిజమైన విశ్వాసి అగును. ఇహలోక శుభములను కూడ అల్లాహ్ తఆలా ప్రీతిని పొందుటకు ఉపయోగించును. కనుక మానవుని మేధా సామర్థ్యములు, మానవుని శారీరక శక్తులు, మానవుని మెరుగైన ఆర్థిక స్థితులు, ఆధునిక కాలపు ఆవిష్కరణలు మన జీవిత ఉద్దేశము నుండి మనలను దూరము చేయకూడదు.

హుజూరె అన్వర్ ఇట్లనిరి. ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం భవిష్యవాణి ప్రకారము ఒక సుదీర్ఘ అంధకార కాలము తరువాత మరల ఇస్లాం సూర్యుడు మసీహ్ మౌవూద్ హయాంలో ఉదయించవలసి వుండెను. అతడు స్వచ్ఛమైన ఇస్లామీయ బోధనలు బోధించి ముస్లిముల హృదయములను అంధకారముల నుండి కాంతి వైపు తీసుకొని రావలసి వుండెను, ముస్లిమేతరులకు కూడ నిజమైన, అందమైన ఇస్లామీయ బోధనలు చెప్పవలసి వుండెనని అహ్మదీయులు ప్రకటింతురు.

ఈ దేశములకు వచ్చిన ప్రతి అహ్మదీపై ఈ బాధ్యతను పూర్తిగా నిర్వర్తించుటకు కృషి చేయు కర్తవ్యము గలదు. అహ్మదీయులు వున్న ప్రతి చోట తమ పరిసరాలలో నిజమైన ఇస్లాం అందించవలెను. ప్రతి అహ్మదీయుని ఆచరణ, అతని ప్రవర్తనలు, అతని ఆరాధన ప్రమాణములు ఇతరులను తమ వైపు ఆకర్షించు విధముగా వుండవలెను. ఇలా అహ్మదీయులు ఇతరుల కంటే భిన్నముగా కనిపించడమే కాక స్థానిక ప్రజలలో ప్రచార మార్గములు అందుబాటులో వచ్చుటకు సహకరించును. మొదట తమ జీవిత ఉద్దేశమును అర్థము చేసుకొని, అనంతరం ఇతరులకు ఈ జీవిత ఉద్దేశమును అర్థము చేసుకొనుటకు ఆహ్వానించాలను గొప్ప ఉద్దేశమును ప్రతి అహ్మదీ గుర్తుంచుకోవలెను. అల్లాహ్ తఆలా సృష్టించిన ప్రాపంచిక వరములు అల్లాహ్ తఆలా నుండి దూరము చేయుటకు కాక అల్లాహ్ తఆలాకు దగ్గగా చేయుటకను వాస్తవమును ప్రపంచానికి స్పష్టము చేయవలెను. కనుక ఇందులో మధ్యేమార్గమును అవలంభించుము. హద్దులు దాటినచో మీరు వినాశనము వైపు పోవుదురు.

హుజూరె అన్వర్ ఇట్లనిరి. ఈ విధముగా వినాశనము వైపు పోవు ఆలోచన కూడ గత నాలుగైదు సంవత్సరముల క్రితం ప్రజలకు లేకుండెను. దీనిని అంగీకరించుటకు సిద్ధముగా లేకుండెను. కాని నేడు పరిస్థితులు పూర్తిగా భిన్నంగా వున్నవి. ఏ వినాశనము వైపు వీరు వెళ్లుచున్నారో దీనికి ముఖ్య కారణము పశ్చిమ దేశముల ప్రగతి మమ్ములను రక్షించునని లేదా నష్టము వాటిల్లినా దానిని మేము పూరించుకోగలమని భావించడమే. ఇలా ఆలోచించు వారి తప్పిదమిది. యుద్ధములు వినాశనము సృష్టించినప్పుడు ఆర్థికంగా బలంగా వున్న ప్రభుత్వములు కూడ యుద్ధముల తరువాత తమను తాము కాపాడుకొనుటకు మొదటగా ప్రయత్నించును. ఆర్థికంగా వెనుకబడిన దేశములు మరింత దుర్భర పరిస్థితులకు దిగజారిపోవును. కనుక అహ్మదీయులున్న ప్రతి చోట ఆచరణాత్మకంగా ప్రయత్నించుచు, అన్నిటికంటే ముఖ్యంగా అల్లాహ్ తఆలా ప్రీతిని పొందుటకు దృష్టి సారించవలెను. ప్రపంచమును

వినాశనము నుండి అల్లాహ్ తఆలా శుభము మాత్రమే రక్షించును. అల్లాహ్ తఆలా శుభములను ఆకర్షించుటకు అల్లాహ్ తఆలా బోధించిన మాటలను ఆచరించవలెను. అతని ఎదుట మోకరిల్లి మాత్రమే అతని ప్రీతిని పొందవచ్చును హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాంను విశ్వసించినంత మాత్రాన ఒక వ్యక్తి ఇహపరలోక శుభములకు అధినేత కాలేదని, నరకాగ్ని నుండి రక్షించబడదని గుర్తుంచుకోవలెను. హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాంను విశ్వసించనందున తమ జీవితమును అల్లాహ్ తఆలా ఇష్ట ప్రకారము మలచుకొను బాధ్యతను మోపునని గుర్తుంచుకోవలెను. హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాం ఒక చోట ఇట్లనిరి.

కేవలం బైఅత్ చేసినంత మాత్రాన ప్రయోజనమేమి లేదని గుర్తుంచుకొనుమ. బైఅత్ నిజమైన భావనను పూరించనంత వరకు ఈ ఆచారముతో అల్లాహ్ తఆలా సంతృప్తి చెందదు. అప్పటి వరకు ఈ బైఅత్ నిజమైన బైఅత్ కాక ఒక ఆచారము మాత్రమే అగును. కనుక బైఅత్ నిజమైన ఉద్దేశమును పూర్తి చేయుటకు కృషిచేయుము. నిజమైన ఉద్దేశమేమిటి? దైవభక్తి కలిగించుకొనుము. పవిత్ర ఖుర్ఆన్‌ను పూర్తి శ్రద్ధతో చదువుము. అనంతరం ఆచరించుము. ఎందుకనగా అల్లాహ్ తఆలా కేవలం నోటి మాటలతో సంతృప్తి చెందదనునది వాస్తవము. అల్లాహ్ తఆలా ఆదేశములను పాటించుట, నివారించిన విషయముల నుండి దూరముండుటయే అల్లాహ్ తఆలా ప్రీతికి కారణమగును. అతడు నివారించిన విషయముల నుండి దూరముండుము. ఇదెంత స్పష్టమైన విషయమనగా మానవుడు కూడ ఉత్తి నోటి మాటలతో అనందించడు. అతడు కూడ సేవతోనే సంతోషించును. సత్యమైన ముస్లిం, అసత్య ముస్లింలో ఇదే తేడా గలదు. అసత్య ముస్లిం కేవలము మాటలాడును తప్ప ఏమియును చేయడు. అతనికెదురుగా వున్న స్వచ్ఛమైన ముస్లిం మాటలాడక ఆచరించును. నా దాసుడు నన్ను ఆరాధించుచున్నాడని. నా కొరకు నా ప్రాణులకు సేవ చేయుచున్నాడని అల్లాహ్ తఆలా చూచినప్పుడు అతనిపై తన దూతలను పంపును. తన వాగ్దానము మేరకు నిజమైన ముస్లిం అసత్య ముస్లింలో తేడా చూపించును.

కనుక స్వచ్ఛమైన ముస్లిం అగుటకు ప్రయత్నించుట మనలోని ప్రతి ఒక్కరి కర్తవ్యము. పరలోక శుభములకు వారసులగుటకే ఈ ప్రాపంచిక శభములు, వరముల నుండి ప్రయోజనము పొందవలెను. మనము మన ప్రార్థనల హక్కులు చెల్లించువారము కావలెను. ధర్మము వలన అనివార్య పరిస్థితులలో మనము మన దేశమును వీడవలసి వచ్చినందున ఇక్కడికి వచ్చిన తరువాత ధార్మిక బోధనలను ఆచరించు హక్కు చెల్లించువారము కావలెను. అల్లాహ్ తఆలా అందరిని ఇందుకు అనుగ్రహించుగాక!

*(Summary: Office Nashr-o-Isha'at, Translation: Incharge Telugu Desk)*

BOOK POST (PRINTED MATTER)

To,

............................................................................

............................................................................

............................................................................